క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పోరుమామిళ్ల : కార్తీక మాసం పురస్కరించుకొని మంగళవారం మండలంలోని ముసల్‌రెడ్డిపల్లె, కొత్రపాటిపల్లె, కవలకుంట్ల పంచాయతీల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. ప్రచారంలో కమిటీ అధ్యక్షుడు నర్రా శ్రీనివాస రెడ్డి, సభ్యులు కృష్ణారెడ్డి, బలరాం, శ్రీనివాసులు, తిరుపతయ్య, అంజలి, లక్ష్మి, రాజ్యలక్ష్మి, కోటయ్య, రామకృష్ణ, శ్రీదేవి, కృష్ణవేణి, సరస్వతి, సింమాద్రి, పద్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో 'పొలం పిలుస్తోంది'

కలసపాడు : మండలంలోని పెండ్లిమర్రి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఈ సంవత్సరం రబీ నుంచి దరఖాస్తు చేసుకుని ప్రీమియంను కామన్ సర్వీస్ సెంటర్‌లో చెల్లించాలని తెలిపారు. అన్ని నోటిఫైడ్ పంటలకు ప్రీమియం చెల్లించేందుకు డిసెంబర్ 15 చివరి తేదీ అని, వరిపంటకు మాత్రమే డిసెంబర్ 31 తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఏఏ గురులక్ష్మి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరి కోతలను వాయిదా వేసుకోవాలి

చాపాడు : రాబోవు రెండు రోజుల్లో తుఫాను నేపథ్యంలో మండల వ్యాప్తంగా రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ సూచించారు. మండలంలోని అన్నవరం, చెంచుపల్లె గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యాగీ మాట్లాడుతూ తుఫాను వర్షం ప్రభావం వలన వర్షాలు వచ్చే సూచనలు ఉన్న కారణంగా నూర్పిళ్ల దశకు వచ్చిన వరి పంటల కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. రబీలో వేసిన వేరుశనగ, మినుము, శనగ పంటలకు డిసెంబర్ 15లోగా ప్రధాన మంత్రి పసల్ భీమా యోజనా పథకం క్రింద ప్రీమియం చెల్లించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ లక్ష్మణ్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులో మంగళవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద రూ.2.65 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. చాపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి మారెమ్మ తల్లి దేవాలయం వరకూ నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఏఈ కేశవ, ఇంజనీరింగ్ అసిస్టెంటు సుప్రజ, టీడీపీ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం క్రింద సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకూ నాణ్యతగా పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులతో కళాశాల యాజమాన్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గౌతమి మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్న ఐదు మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామసుబ్బమ్మ మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్‌జేఏవై టెక్నాలజీస్ వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో సీఎస్‌ఈ విద్యార్థినులు కె.షేక్ అఫ్రీన్, జె.భావన, ఎస్.సుప్రియ, సి.మహేశ్వరి, ఈసీఈ విద్యార్థిని షేక్ అమీన ప్రతిభ చూపి ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. వీరికి ఏడాదికి రూ. 3లక్షల ప్యాకేజీ ఇవ్వనున్నట్లు వివరించారు. విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూష, ప్లేస్ మెంట్ ఆఫీసర్ డి.సురేంద్ర, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.

బకాయిల వసూళ్లలో అలసత్వం వద్దు

మైదుకూరు : విద్యుత్ బకాయిల వసూళ్లలో అలసత్వం పనికిరాదని వెంటనే వసూళ్ల చేయడంపై దృష్టి సారించాలని విద్యుత్‌శాఖ జిల్లా ఎస్ఈ ఎస్.రమణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మైదుకూరు, దువ్వూరు విద్యుత్ కార్యాలయాలను, విద్యుత్ బిల్లుల వసూళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది విధులను పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో ఆయన మాట్లాడుతూ విద్యుత్ బకాయిలు అధిక మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సంస్థ నెల రోజుల ముందు విద్యుత్ కొనుగోలు చేసి వినియోదగదారులకు సరఫరా చేస్తోందని, మరొక నెల రోజులు గడువు ఇచ్చి బిల్లు కట్టమంటోందన్నారు. అంటే మొత్తం రెండు నెలలు గడువు వినియోగదారులకు ఇస్తుందని తెలిపారు. విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ వద్దని దయ చూపించే స్థితిలో సంస్థ లేదని పేర్కొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రొద్దుటూరు క్రైం : బీఆర్ అంబేడ్కర్‌కు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు,నాయకులు



బద్వేలు అర్బన్ : అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ, నాయకులు



పోరుమామిళ్ల: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ మన దేశ రాజ్యాంగాన్ని ప్రపంచ దేశాలన్నీ గౌరవిస్తాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత పూర్వక రాజ్యాంగం మనదేశ రాజ్యాంగమని చెప్పారు. మనం ఈ రోజు స్వేచ్ఛగా మాట్లాడుతూ, స్వేచ్ఛగా జీవించడానికి, మన దేశంలోని చట్టాలన్నింటికి మూలాధారం మన రాజ్యాంగం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ జేష్టాది శారద, జెడ్పీటీసీ జీరెడ్డి అంజనీకుమారి, ఎంపీపీలు, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మనందరి బాధ్యత

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మైదుకూరు రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాపాడు : స్థానిక వెలుగు కార్యాలయం వద్ద మంగళవారం 75వ రాజ్యాంగ అమలు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వీర కిషోర్ రాజ్యాంగ నిర్మాత డా.బీ ఆర్ అంబెద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రాజ్యాంగ ద్వారా కల్పించిన హక్కులను కాలరాస్తూ పాలన సాగిస్తోందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ ధ్వజమెత్తారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక నెల్లూరు రోడ్డు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని సుధ విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, వైవీయూ పాలక మండలి సభ్యులు కె.సి.సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, కన్వీనర్ యద్దారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ బి.మునెయ్య, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలి

మైదుకూరు : ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలని మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ కృష్ణారెడ్డి, ఆర్ఆర్‌సీ కోఆర్డినేటర్ అయ్యవారు రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

రాజ్యాంగ స్ఫూర్తితో నడుద్దాం

పోరుమామిళ్ల : రాజ్యాంగ స్ఫూర్తితో నడుద్దామని జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు వైజంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజశేఖర్, ఎంపీటీసీలు మహబూబ్‌పీర్, చెన్నరాయుడు, ఉపసర్పంచ్ నాగేంద్రప్రసాద్, రాళ్లపల్లె నరసింహులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

గోపవరం : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం మాలమహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాలరవి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

కలసపాడు : 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి దళిత నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, అధికారులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ప్రేమ్‌సాగర్, ఏఎస్ఐ నాగయ్య, మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బంది వీఆర్‌ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి

ప్రొద్దుటూరు : ఏపీ రాష్ట్ర మాలమహానాడు (విజయ శేఖర్ వర్గం) ఆధ్వర్యంలో రాజ్యాంగ 75వ దినోత్సవం సందర్భంగా మైదుకూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశంలోని ప్రతి ఒక్కరికి సమాన హక్కులు కల్పించారని ఏపీ రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జాకట విజయశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ అధ్యక్షుడు జేష్టాది భాస్కర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గూడెం చెరువు సంపత్, దానియల్, జాకట దీపక్, సునీల్, పవన్ పాల్గొన్నారు.

పశువైద్య కళాశాలలో..

మండలంలోని గోపవరం వద్ద ఉన్న పశువైద్య కళాశాలలో మంగళవారం ఘనంగా రాజ్యాంగ దినోత్సవం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఓఎస్ఏ డాక్టర్ బి.మానస, ఓఏఎం డాక్టర్ కె.రాజకిశోర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ డి.ఇందిర, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ ఆయి గుణరంజన్, బోధన, బోధనేతర సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఉర్దూ జూనియర్ కాలేజీలో మంగళవారం ఎంపీజే ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, జమా అతె ఇస్లామి హింద్ రాష్ట్ర సలహామండలి సభ్యుడు మొహిద్దీన్, ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాషా, ఉపాధ్యక్షుడు నజీర్ అహ్మద్, కార్యదర్శి మహమ్మద్‌రఫి, అస్లాం, ఇస్మాయిల్, ముక్తార్ పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన

స్థానిక ఎస్ఎస్ మాల్‌లో మంగళవారం జీవనజ్యోతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జీవనజ్యోతి విద్యాసంస్థల కరస్పాండెంట్ అమర్‌నాథ్ రెడ్డి రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు, రాజ్యాంగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించార

ఖాజీపేట : భారత రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులతో స్వేచ్ఛగా జీవిస్తున్నామని ఎంపీడీఓ దివిజా సంపతి అన్నారు. భారత రాజ్యాంగం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ఖాజీపేట బస్టాండ్ కూడలిలో దళిత సంఘం నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. పుల్లూరు అంబేడ్కర్ సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘం నాయకుడు వెంకటరమణ ఆధ్వర్యంలో విగ్రహానికి ఘన నివాళి అర్పించారు. అలాగే బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో నాగస్వర్ణలత, ఉమాదేవి పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం బి.మఠం పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు, విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులు నివాళి అర్పించారు.



రాజ్యాంగ దినోత్సవ వేడుకలో జీవనజ్యోతి విద్యాసంస్థల కరస్పాండెంట్ అమర్‌నాథ్ రెడ్డి, విద్యార్థులు



మైదుకూరు హైస్కూల్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు



చాపాడు: దేశ నాయకుల వేషధారణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా ముక్తిరామలింగేశ్వరుని గ్రామోత్సవం



గ్రామోత్సవంలో గంగాగౌరి సమేత ముక్తిరామలింగేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీ ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మహోత్సవాలు, తిరునాల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి గంగాగౌరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో శివనామస్మరణల మధ్య వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో డప్పువాయిద్యాల సందడి, మహిళల కోలాటం, బాణసంచా పేలుళ్ల ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి కాయాకర్పూరాలు నైవేద్యంగా సమర్పించారు. తిరునాల మహోత్సవాల్లో భక్తులతో రామేశ్వరం కిటకిటలాడింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



జీవామృతాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజ

అట్లూరు : ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. బద్వేలు మండల పరిధిలోని తిప్పనపల్లి రైతు సేవాకేంద్రం పరిధిలోని పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల్లో, బావుల్లో నీరు పుష్కలంగా ఉందని పైర్లకు నీటి కొరత ఉండదని ప్రతి రైతు అనువైన పంటల సాగు చేసుకోవాలని సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. ఈ పద్ధతిలో ఖర్చులు తగ్గడంతో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి చంద్రమోహన్‌రెడ్డి, రైతు సేవాకేంద్ర వ్యవసాయ సహాయకులు కోడూరు సందీప్‌కుమార్, గంపా వెంకటేశ్వర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లీలావతి, రైతులు పాల్గొన్నారు.

గోపవరం : వివిధ పంటలు సాగు చేసే రైతులు అందుబాటులో ఉన్న వ్యవసాయాధికారులు, సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలని బద్వేలు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రాచాయపేట రైతుసేవా కేంద్రం పరిధిలోని బెడుసుపల్లెలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవసాయ విస్తరణాధికారులు ఓబయ్య, విజయకుమార్, సుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

హక్కుల రక్షణ బాధ్యత న్యాయవ్యవస్థలదే



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

బద్వేలు అర్బన్ : ప్రజల ప్రాథమిక హక్కుల రక్షణ బాధ్యత న్యాయవ్యవస్థలదేనని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సీపీఎం రూరల్ కమిటీ మహాసభల సందర్భంగా మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ హిందుత్వ రాజ్యాంగాన్ని తెరవడానికి, మనధర్మశాస్త్ర ఆధార చట్టాలను అమలు చేయడానికి గట్టిగా ప్రయత్నిస్తోందని, ఇది దేశ సమైక్యతకు, సమగ్రతకు ముప్పు తెస్తుందని అన్నారు. అలాగే జమిలి ఎన్నికల పేరుతో ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతోందని అన్నారు. తొలుత సీపీఎం జెండాను ఆవిష్కరించి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం రూరల్ కార్యదర్శి వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శివకుమార్, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా, ఓబయ్య పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

బద్వేలు అర్బన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ సంస్థల కొమ్ముకాస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.చంద్రశేఖర్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఇ.నాగేష్ పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం ఏఐటీయూసీ, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్నాయని అన్నారు. అనంతరం ఆర్డీఓ చంద్రమోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు నాగేంద్రబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐటీయూసీ, సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు రవీంద్ర, సత్య, కొండయ్య, శ్యాంప్రవీణ్, ప్రవీణ్‌కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని, వికలాంగ సంఘం నాయకులు వెంకటపతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : పౌష్టికాహారం తీసుకుంటే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని ఎంఈఓ సావిత్రమ్మ తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా 190 మంది విద్యార్థులకు వైద్యాధికారిణి డాక్టర్ హిమబిందు వైద్య పరీక్షలు చేశారు. విద్యార్థులకు ఎత్తు, బరువు, రక్త పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ విద్యార్థులకు వివరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీలు జ్యోతి, రెబక, కేశమ్మ, సీఓ ఎంపీ సుబ్బారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుర్రప్ప, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వనభోజనం

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి కామనూరు గోశాల ఎదురుగా ఉన్న అఖిలభారత బ్రాహ్మణ ఉత్తరక్రియా పుణ్యధామంలో కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నట్లు పుణ్యధామ సొసైటీ ప్రెసిడెంట్ సాతవెల్లి ప్రదీప్‌కుమార్ శర్మ, ట్రెజరర్ వెల్లాల బాబ్జి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం కార్తీక నదీస్నానం, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, ఆహ్వానితుల ప్రసంగం, మధ్యాహ్నం వనభోజనం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

దుస్తులు పంపిణీ

కాశినాయన : మండలంలోని కొండ్రాజుపల్లె, గంగనపల్లె ఆర్సీఎం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు క్రిస్మస్, నూతన సంవత్సరం పురస్కరించుకుని పోరుమామిళ్లకు చెందిన ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డిలు మంగళవారం ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా విద్యార్థులకు సంతోషంగా పండుగను జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో దుస్తులను పంపిణీ చేశామన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ ప్రాంగణంలో 'సామాజిక అధికారిత శివిర్ 'అలింకో' అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ అందించిన 650 ట్రై సైకిళ్లను మంగళవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవం నాడు దివ్యాంగులకు సైకిళ్లు, బ్యాటరీ వాహనాలను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సాయిశ్రీ, డీఈఓ మీనాక్షి, తహసీల్దార్ రంగయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున, ఏడీ కిశోర్ పాల్గొన్నారు.

ఏపీజీబీ వద్ద సీఐటీయూ నిరసన



ప్రొద్దుటూరు గాంధీ రోడ్డులోని ఏపీజీబీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక గాంధీ రోడ్డులోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద మంగళవారం సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కడపలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కేంద్ర కార్యాలయాన్ని అమరావతికి తీసుకెళ్లొద్దని, ఇది మంచి ఆలోచన కాదన్నారు. ఈ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని, దీనిపై జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ స్పందించాలని కోరారు. కడప జిల్లాను అభివృద్ధి చేయాల్సింది పోయి అడ్డుకోవడం తగదన్నారు. జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి జిల్లాలో స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాల్మన్, చంటి, రాఘవ, ఓబయ్య, సీతమ్మ, రమాదేవి, అన్నపూర్ణ, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాపై అవగాహన సదస్సు



పంటల బీమా వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వ్యవసాయాధికారులు

బి.కోడూరు : మండలంలోని తంగేడుపల్లె రైతుసేవా కేంద్రంలో మంగళవారం రబీ పంటల ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన పోరుమామిళ్ల సహాయ వ్యవసాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 8 రకాలకు సంబంధించిన వ్యవసాయ పంటలు బీమా కొరకు ఎంపిక చేయడం జరిగిందని, ఈ పంటలు సాగు చేసిన రైతులు మీసేవ కేంద్రానికి వెళ్లి ఆయా పంటల ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఒకవేళ రైతులు బ్యాంకులో రుణం తీసుకుంటే అప్పుడు కూడా ప్రీమియం చెల్లించవచ్చన్నారు. ఎకరాకు వరికి రూ.630, శెనగ, వేరుశనగలకు రూ.480లు, జొన్నకు రూ.315, ప్రొద్దుతిరుగుడు రూ.300లు, మినుములు రూ.285లు, పెసలు రూ.270లు, నువ్వులకు రూ.180లు చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. వరిపంటకు డిసెంబర్ 31వ తేదీలోపు, మిగతా పంటలకు డిసెంబర్ 15వ తేదీలోపు రైతులు ప్రీమియం చెల్లించాలని తెలిపారు. రైతులతో కలిసి పంటల బీమా గోడపత్రాలు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి ఆయా పంటలలో వస్తున్న తెగుళ్లు, పురుగులు నివారణ గురించి వివరించి వాటి సస్యరక్షణ పద్ధతుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కౌశిక, బ్రహ్మానందరెడ్డి, ఇన్స్యూరెన్స్ కంపెనీ ప్రతినిధి తరుణ్, రైతులు పాల్గొన్నారు.

మహిళల ఉజ్వల భవితకు 'కిషోరి వికాసం'



చాపాడు: కిషోరి బాలికా వికాస్‌పై మాట్లాడుతున్న ఎంపీడీఓ వీర కిషోర్



పోరుమామిళ్ల: దేశ నాయకుల చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న అధికారులు

చాపాడు : యుక్త వయసు బాలికలు, మహిళల ఉజ్వల భవితకు కిషోరి వికాస కార్యక్రమం ఉపయుక్తంగా ఉంటుందని మండల అభివృద్ధి అధికారి వీర కిషోర్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం వద్ద మంగళవారం మిషన్ శక్తి పథకంలో భాగంగా కిషోరి బాలికా వికాస్ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఉపాధ్యాయిలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కౌమార దశలో ఉండే బాలికలకు ఆత్మరక్షణ, యోగా, ఫోక్సో చట్టాలు, విద్య, ఆరోగ్యం వంటి అంశాలపై గ్రామాలలో వివరించి అవగాహన కల్పించాలన్నారు. నిత్యం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే కేటాయించబడిన ప్రభుత్వ యంత్రాంగం కౌమార దశలోని బాలికలను చైతన్యవంతులు చేయాలని సూచించారు. అనంతరం డిజిటల్ స్క్రీన్‌పై కిషోరి బాలికా వికాస్ కార్యక్రమంపై జానకీరామ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఎంఈఓ లు రవిశంకర్, వంశీకృష్ణ, వెలుగు ఏపీఓ శ్రీధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : కిషోరి వికాసం 4వ దశ శిక్షణ మంగళవారం సభాభవనంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ రమణారెడ్డి, ఎస్ఐ కొండారెడ్డి, సీడీపీఓ లక్ష్మిదేవి, ఎంఈఓలు కాశయ్య, బాల వెంకటరెడ్డి బాల్యవివాహాలు, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. పోస్కో చట్టం గురించి వివరించారు. బాలికలను తల్లిదండ్రులు చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజీవ్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి, ఐసీడీయస్ సూపర్‌వైజర్లు మాధవి, రత్నకుమారి, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికా కిశోర వికాసంపై శిక్షణ

మైదుకూరు : స్థానిక మండల పరిషత్ సభాభవనంలో మంగళవారం బాలిక కిశోర వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, మండలంలోని వైద్యాధికారులు, ఎంఈఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలి

గోపవరం : బాల్యవివాహాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. మంగళవారం మండల అభివృద్ధి కార్యాలయంలో కిశోరి వికాస కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ టీచర్లు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సహాయకులు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కౌమార వయస్సు పిల్లల పరిస్థితులు, వారి అభివృద్ధి కొరకు తీసుకోవాల్సిన మార్గాలు, ఆరోగ్యం, పోషణ, బాల్యవివాహాల నిర్మూలన, యుక్త వయస్సు పిల్లల్లో వచ్చే మార్పులు, చిన్న వయస్సులో గర్భాధారణ నివారణ, చిన్నపిల్లల వేధింపుల నివారణ అంశాలపై ఎంపీడీఓ వివరించారు. తొలుత 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ రామనాథరెడ్డి, సిబ్బంది డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ శ్రీనివాస్, ఈఓపీఆర్డీ హసీనా, సీడీపీఓ శ్రీదేవి, ఎంఈఓ చెన్నయ్య, ఏపీఎం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో నూతన చైతన్యం రావాలి

బి.కోడూరు : మహిళల్లో నూతన చైతన్యం తీసుకువాలని ఎంపీడీఓ భాస్కర్‌రావు తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయ భవనంలో కిశోరి బాలికల హక్కులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో గ్రామసభలు నిర్వహించి కిశోరి బాలికల హక్కుల గురించి, బాల్యవివాహాల వలన కలిగే నష్టం గురించి వివరిచి ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ, విద్యాశాఖాధికారి సునీల్‌కుమార్, ఏపీఎం సీతారామిరెడ్డి, ఐసీడీఎస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.